
www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 17 డిసెంబర్ 2024

5

తూర్పుగోదావరి



అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

అంబేద్కర్ ఆశయాలను ఆచరించినప్పుడే సమాజంలో అసమానతలు తొలగుతాయని టిడిపి యువ నాయకులు అల్లూరి విక్రమాదిత్య అన్నారు. మండలంలోని అన్నదేవరపేటలోని పాత పేటలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నదాన నిర్వహించారు. సర్పంచ్ ఎలిపే సుధారాణి, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎలిపే బాలస్వామి, గౌరవ సలహాదారు అక్కాబత్తుల విజయ్‌కుమార్, కొవ్వూరు సిఐ విజయబాబు, తాళ్లపూడి ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అడ్డగోలు దోపిడీ

- ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అధిక ధరలకు విక్రయాలు
- ప్రయాణికుల జేబులకు చిల్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో వ్యాపారులు ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రయాణికులు జేబులు చిల్లు పెడుతున్నారు. ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నా ఏ అధికారీ అటుగా చూసే ప్రయత్నమే చేయట్లేదు.



రాజమహేంద్రవరం ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు ప్రతి రోజూ 20వేలకు పైగా ప్రయాణికులు వస్తుంటారు. ఇక్కడ నుంచే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల అవసరార్థం కాంప్లెక్స్‌లో వివిధ ఆహార, ఇతర వస్తువుల విక్రయశాలలను ఏర్పాటు చేశారు. ఏటా వీటి నిర్వహించుకునేందుకు వేలం ద్వారా షాపులను కేటాయిస్తున్నారు. ఇలా షాపులు దక్కించుకున్న వ్యాపారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. వారి సొంత ధరలకు వస్తువులను విక్రయిస్తున్నారు. ప్రయానికుల అవసరాలను అవకాశంగా మార్చుకుని ఈ దందాను కొనసాగిస్తున్నారు. వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్లు ఇలా ప్రయాణికులకు అవసరమైనవన్నీ ఇక్కడ అందుబాటులో ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రూ.10 విలువ చేసే 500 ఎంఎల్ వాటర్ బాటిల్‌ను రూ.15 చొప్పున అమ్ముతున్నారు. రూ.20 విలువ చేసే ఒక లీటరు వాటర్ బాటిల్ రూ.25 చొప్పున అమ్ముతున్నారు. రూ.35 విలువ చేసే కూల్ డ్రింక్ రూ.50లకు విక్రయిస్తున్నారు. రూ.15 ఎంఆర్‌పి గల లోకల్ డ్రింక్ రూ.25ల చొప్పున అమ్ముతున్నారు. పల్పి ఆరెంజ్ ఎంఆర్‌పి రూ.20 కాగా రూ.25 చొప్పున అమ్ముతున్నారు. రూ.10 విలువ చేసే నిమ్మసోడా రూ.15 అమ్ముతున్నారు. కాంప్లెక్స్‌లో పల్లె వెలుగు బస్టాండ్‌లో 6, మెయిన్ బస్టాండ్‌లో 12 మొత్తం కలిపి 18 షాపులు ఉన్నాయి. ఈ షాపుల ద్వారా సుమారు రూ.19.49 లక్షల ఆదాయం ఆర్‌టిసికి వస్తుంది. టెండర్ల ద్వారా షాపులు పొందిన వ్యాపారులు నిర్దేశిత కాలపరిమితి అనంతరం తిరిగి టెండర్ల ప్రక్రియలోపాల్గొనాలి. షాపులు కేటాయించే సమయంలో ఆర్‌టిసి అధికారులు ఆ షాపులో ఏరకమైన వ్యాపారం నిర్వహించాలో ముందుగానే తెలియజేసి టెండర్లను స్వీకరిస్తున్నాయి. అయితే ఆచరణలో భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యాపారులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. ఉదాహరణకు కూల్ డ్రింక్స్‌కు పర్మిషన్ తీసుకున్న వారు ఇతరాత్ర వ్యాపారాలు చేస్తున్నారు. షాపు పరిధి దాటి బస్టాండ్ ఆవరణలో స్టాకు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించేలా అడ్డుగా పెట్టుకోవడం పరిపాటిగా మారింది. పల్లెవెలుగు బస్టాండ్‌లో ఓ స్టాల్‌కు కేవలం కూల్ డ్రింక్స్ అమ్మేందుకు మాత్రమే అనుమతి ఉంది. కానివాటర్ బాటిల్స్, బిస్కట్స్, చిప్స్, బాదంపాలు, బటర్ మిల్క్, లస్సీ, పాప్ కార్న్, సమోసా ఇలా పలు రకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అదే బస్టాండ్‌లో మరో రెండు షాపులు. ఒకటి హాట్ చిప్స్, మరొకటి టీస్టాల్‌గా అనుమతి తీసుకున్నారు. కానీ కూల్ డ్రింక్స్, బాదం, బిస్కట్స్, ఫ్రూటీ, యాపిల్ జ్యూస్ ఇలా పలు రకాలు అనధికారికంగా విక్రయిస్తున్నారు. షాపు నందు కూడా 3 అడుగులు ముందుకు జరుపుకుని విక్రయిస్తున్నారు. మరొక స్టాల్‌లో ఫ్రూట్ జ్యూస్ విక్రయించేందుకు అనుమతి తీసుకుని పలు రకాల పానీయాలు అనధికారికంగా అమ్ముతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తయారీ తేదీ ముద్రించి బ్యాండెడ్ ఉత్పత్తులనే విక్రయించాల్సి ఉంది. అయితే దీనికి భిన్నంగా బాదంమిల్క్, పాప్‌కార్న్ వంటి ప్యాకెట్లకు తేదీలు, ధరల వివరాలు లేని ప్యాకింగ్‌లు చేసి విక్రయిస్తున్నారు. కొన్ని షాపుల ఎదుట ధరల పట్టికలు కూడా ఏర్పాటు చేయకపోవటం విస్తుగొలుపుతోంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా పర్యవేక్షించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

బస్టాండ్‌లోని స్టాల్స్ నిర్వహకులు ఎంఆర్‌పి ధరలకు మాత్రమే వ్యాపారులు విక్రయించాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు. ప్రయాణికుల నుంచి అధిక ధరలను డిమాండ్ చేస్తే ఆర్‌టిసి అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. కాంప్లెక్స్‌లో షాపులపై ప్రతి వారం పర్యవేక్షణ ఉంటుంది. ఇటీవల తనిఖీ చేపట్టాము. రెండు స్టాల్స్ నిర్వహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాము.

- షేక్ షబ్నం, డిపో మేనేజర్, రాజమహేంద్రవరం



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

విద్యుత్ బిల్లుల దహనం

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలతో ప్రజల జేబులకు చిల్లు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రరం శ్యామలా సెంటర్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ బారాలు పెంచబోమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.11వేల కోట్ల భారాన్ని మోపారన్నారు. గత వైసిపి ప్రభుత్వం విద్యుత్ బారాలు మోపినప్పుడు 'బాదుడే బాదుడు' అని చెప్పి విమర్శించారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అదే విధానాన్ని అమలు చేస్తూ ప్రజలపై విద్యుత్‌భారాలు మోపడం ఎంతవరకూ సమంజసమన్నారు. సర్దుబాటు ఛార్జీల బారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తులసి, ఎన్.రాజా, రాజమహేంద్రవరం నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, నగర కమిటీ సభ్యులు పి.మురళీకృష్ణ, వి.రాంబాబు, నాయకులు ఎస్ఎస్.మూర్తి, సుబ్రహ్మణ్యం, పేరయ్యలింగం, అన్నామణి, సోమేశ్వరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం జేబులో చిల్లి పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ధవలేశ్వరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగర కార్యదర్శి కె.రామకష్ణ, ధవళేశ్వరం గ్రామ కార్యదర్శి పడాల రామకృష్ణ మాట్లాడారు. కుటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగు నెలల గడవక ముందే ప్రజలపై విద్యుత్ భారాన్ని వేయడం సరికాదన్నారు. విద్యుత్‌ఛార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పారన్నారు. కాని అధికారంలోకి వచ్చిన తరువాత ఛార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారాలు మోపారన్నారు. ఈ కార్యక్రమంలో వి.పేరయ్య లింగం, బిఎస్.ప్రకాష్, డి.శ్రీను, సిహెచ్.రామకృష్ణ, రాజశేఖర్, కృష్ణ, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిఆర్ఒ టి.సీతారామమూర్తి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు నుంచి119 అర్జీలను స్వీకరించారాని తెలిపారు. వీటిని సంబంధిత అధికారులకు పంపించామని తెలిపారు. వీటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ ఎల్.అప్పలకొండ, డిఎల్‌డిఒ వీణాదేవి, జిల్లా అధికారుల తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న డిఆర్ఒ సీతారామమూర్తి

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - గోపాలపురం

ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మండలంలో పలు గ్రామ సచివాలయలు వద్ద ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ బిఎస్-ఎస్.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ రాజంపాలెం, జగన్నాథపురం 18వ తేదీ సగ్గొండ, చిట్యాల, 19వ తేదీ గుడ్డిగూడెం, వాదాలకుంట, 20వ తేదీ రేగులకుంట, కరిచర్లగూడెం సచివాలయాల వద్ద నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆధార్ క్యాంపులు అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేట్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

28న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల మానవతా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న తాళ్లపూడిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షులు అంకెం సురేష్ తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను మండల గౌరవాధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు, గౌరవ డైరెక్టర్ గోకవరపు బాబులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబులు మాట్లాడుతూ తాళ్లపూడిలోని సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. దీన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. జనార్ధనరావు మాట్లాడుతూ రాజానగరం జిఎస్ఎల్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. 30 మంది వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తారన్నారు.

ఆసుపత్రిలో అన్ని వసతుల ఏర్పాటుకు కృషి

సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో అన్ని వసతులూ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, స్పెషల్ ఆఫీసర్ భాస్కరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. సమావేశంలో చర్చించిన అంశాలను, తీసుకోబోయే చర్యలను వెల్లడించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు సంతృప్తికరంగా బయటకు వెళ్ళేలా అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రెండు, మూడు ఫ్లోర్ల నిర్మాణం పూర్తయిందని, అవసరమైన పరికరాలు రావాల్సి ఉందన్నారు. రోగులకు మరింత మెరుగైన వైద్యం, సదుపాయాలు కల్పించాలనే కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. ఎంఆర్ఐ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, సిటి స్కాన్ ఆపరేట్ చేయడానికి రేడియాలజిస్టును నియమిస్తామన్నారు. దీని కోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులతో సంప్రదిస్తామని తెలిపారు. యూరియాలజిస్టు, కార్డియాలజిస్టు ఇలా అవసరమైన వారిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య పరీక్షల రిపోర్టుల్లో జాప్యాన్ని నివారిస్తామని తెలిపారు. ఐఎంఎ సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బయో వ్యర్థాలను కాల్చకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశిస్తామని ఆయన తెలిపారు.

జెసి చిన్నరాముడు మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో ఎస్‌బిఐ ద్వారా ఇ-కార్నర్/బ్రాంచ్ ఏర్పాటు చేయిస్తామన్నారు. జిటిజి వాచ్‌లోని ఆయుష్ మెడికల్ ఆఫీసర్లను హెచ్‌డిఎస్ నుంచి సక్రమంగా ఖర్చు చేస్తూ సర్దుబాటు చేయాలన్నారు. లాండ్రీ డిపార్ట్‌మెంట్ కోసం వినియోగిస్తున్న ఐఎఫ్‌బి వాషింగ్ మెషీన్‌కు మరమ్మతులు, అన్ని విభాగాలకు బిఎస్ఎన్ఎల్ ఇంటర్‌కామ్ సేవలను అందిస్తామన్నారు. 2022 అక్టోబర్ 1 నుండి 2024 నవంబర్ 30 వరకు ఎన్‌టిఆర్ వైద్య సేవ, హెచ్‌డిఎస్ నుంచి చేసిన ఖర్చుల ధృవీకరణ, ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అంశాలను చర్చించామనఆనరు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మిసూర్య ప్రభ ఎజెండాను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కేబుల్ మురళి, అనూప్ జైన్, ఉమా, గుత్తుల సత్యనారాయణ, సూపరింటెండెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ఎస్‌టిల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కడియం

రాష్ట్రంలో అనంతపురం నుండి శ్రీకాకుళం వరకు 34 షెడ్యూల్ తెగల వారు ఉన్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిత్యయంతో ఉందని ఎస్‌టి కమిషన్ సభ్యులు వదిత్య శంకర్‌నాయక్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన సోమవారం కడియం మండలం వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కేఎన్ జ్యోతి, మండల స్థాయి అధికారులతో కలిసి ఎస్‌టి కుల పెద్దలతో సమావేశమయ్యారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వెంటనే వాటి నిర్మాణాలు చేయాలని కోరారు. తమ నివాస ప్రాంతాల్లో డ్రెయినేజీల పూడికతీత పనులు జరగట్లేదని, మురుగునీరు రోడ్లపైకి చేరుతుందని తెలిపారు. ఫలితంగా దోమలు వీపరీతంగా పెరిగిపోయా యన్నారు. వీటి వల్ల నానా రోగాలబారిన పడుతున్నామని వాపోయారు. అలాగే కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కులదైవమైన ఏకలవ్యుడు విగ్రహాన్ని వేమగిరి సెంటర్ వద్ద, కడియపులంక వద్ద ఏర్పాటుకు సహకరించాలని విన్నవించారు. కడియపులంకలో నిర్మించిన కమ్యూనిటీ హాలుకు విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేక చెడు మార్గాల వైపు చూస్తున్నారని, వారికి ఉద్యోగాలు కల్పించాలని, ఉపాధి కోసం బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. అలాగే పలు సమస్యలపై కమిషన్ సభ్యులకు కుల పెద్దలు వినతి పత్రాన్ని సమర్పించారు. సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఆయాలకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు కోరుతున్నారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో మొత్తం 52 మంది ఉన్నామన్నారు. తమకు నెలకు రూ.6వేలు చెల్లిస్తున్నారన్నారు. ఇది కూడా 5 నెలలుగా నిలిపేశారన్నారు. దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని తెలిపారు. కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పిల్లలకు ఫీజులు కూడా కట్టలేని పరిస్థితుల్లో ఉన్నామని వాపోయారు. ఐదు నెలలుగా అప్పులు చేసి గడిపామని, ఇప్పు కొత్తగా అప్పులు కూడా పుట్టడం లేదన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తమ ఇబ్బందులను దష్టిలో పెట్టుకుని వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామ స్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, తహశీల్దార్ కె.అజయ్ బాబు సూచించారు. సోమవారం గోపాలపురం సచివాలయం-1 వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.అజయ్‌బాబు మాట్లాడారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా ఈ సదస్సుల్లో చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని కోసం ఎలాంటి రుసుము చెల్లించనవరం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో అందుబాటులో ఉంటామని, ఎప్పుడైనా అర్జీని ఇవ్వొచ్చన్నారు. దరఖాస్తులు రాగా అందులో నాలుగు సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు జ్యేష్ట శ్రీధర్, రెవెన్యూ అధికారులు సూర్యారావు, శ్రీనివాస్, జివివి.లక్ష్మి, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ముప్పవరంలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని ఎస్.ముప్పవరంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దీనికి తహశీల్దార్ ఎం.మెరికమ్మ అధ్యక్షత వహించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులన సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఎస్‌కె.కమల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ గుమస్తా శ్రీనివాస్, ఎండోమెంట్ కార్యాలయం అధికారి గెల్లా సోమరాజు, రెవెన్యూ సిబ్బంది, విఆర్ఒలు పాల్గొన్నారు.

సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కడియం

మండలంలోని వేమగిరి జక్కంపూడి నగర్‌లో ఆరంగి లక్ష్మణ్ ఇంటి నుంచి దాసరి చిన్ని ఇంటి వరకు, సుమారు రూ.11 లక్షలతో నిర్మించే రోడ్డు, డ్రెయినేజీ పనులకు స్థానిక ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, మాజీ సర్పంచ్ డాక్టర్ వెలుగుబంటి వెంకటాచలంతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, జక్కంపూడి నగర్ ప్రజలు పాల్గొన్నారు..




శంకుస్థాపన చేస్తునన ఎంపిపి, మాజీ సర్పంచ్

మీనానగరంలో ఎస్‌టి కమిషన్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి - చాగల్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు వదిత్య శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పలువురు అధికారులు చాగల్లు శివారు మీనానగరంలో సోమవారం పర్యటించారు. సంచార జాతులవారితో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 22 కుటుంబాలు జీవిస్తున్నామని. తమకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని అయిలే ఇల్లు కట్టుకునే స్థోమత లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వృద్ధునికి 50 కేజీలు బియ్యాన్ని తహశీల్దార్ ఎం.మెరికమ్మ ఆధ్వర్యంలో ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరకమ్మ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు

కార్టూ'నిజం'



అన్యాక్రాంతమవుతున్న ఇరిగేషన్ భూమి

నిమ్మకు నీరెత్తినట్లు నీటిపారుదల శాఖ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని శెట్టిపేట - కాకరపర్రు కాలువ గట్టుపై ఇరిగేషన్ భూమి అన్యాక్రాంతమవుతుంది. అయినప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారులు నిమ్మకు నేరెత్తినట్టు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. 'అనధికార సాగు 'పేరిట' గత నెలలో ప్రజాశక్తి దినపత్రికలో దీనిపై కథనం ప్రచురితమైంది. ఈ విషయమై ఇరిగేషన్ ఎఇ మురళి మాట్లాడారు. నాలుగు రోజుల్లో తోటను తొలగించేలా రైతుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆయన తొలగించకపోతే అధికారులే పంటను తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇది జరిగి నెలరోజులైనా ఇంకా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇదే ప్రాంతంలో గతంలో సాధారణంగా ఏటిగట్టు రైతులు పశువుల పోషణకు అవసరమైన పచ్చగడ్డి వంటి పంటలు వేసుకునేవరు. ఇప్పుడు గడ్డి స్థానంలో వాణిజ్య పంటలను భారీ స్థాయిలో ఇక్కడ సాగు చేస్తున్నారు. దీని కోసం ఏకంగా మోటారు పంపు, దాన్ని ఉంచేందుకు పక్కా షెడ్డును సైతం అక్రమార్కులు నిర్మించారు. కాలువ నుంచి అక్రమంగా పైపులు వేసి నీటిని సైతం వాడుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గతంలో వచ్చిన వరదలకు ఇదే ప్రాంతంలో గండి పడి వందలాది ఎకరాల్లో పంట ముంపునకు గురైంది. ఈ ప్రాంతాన్ని పటిష్టం చేయాల్సింది పోయి అక్రమసాగుకు అవకాశం ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అదే గట్టు ఆవలివైపున ఉన్న ప్రభుత్వస్థలం కూడా కబ్జాకు గురైంది. గతంలోనూ ప్రజాశక్తి ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. దీని తొలగించాలని కోర్టు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కూడా నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వెనుక నేతల ఒత్తిడి ఉందా? లేదా మామూళ్ల మత్తు ఉందా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సర్పంచ్ సత్యనారాయణ కోరుతున్నారు.



విద్యుత్ మోటారు కోసం ఏర్పాటు చేసిన శాశ్వత నిర్మాణం



కాలువ గట్టు వెంబడి వేసిన బొప్పాయి తోట



ఇరిగేషన్ స్థలంలో వేసినబొప్పాయి మొక్కలు

వేట్లపాలెంలో పోలీస్ పికెటింగ్

-కాకినాడ జిజిహెచ్‌లో పోస్టుమార్టం
-గ్రామానికి చేరుకున్న మృతదేహాలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెంలో ఆదివారం రాత్రి జరిగిన దాడిలో పోలీసులు పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే...తమ కుటుంబ సభ్యులను హతమార్చిన వారిని శిక్షించే వరకు పోస్టుమార్టంకు సహకరించేది లేదంటూ కాకినాడ జిజిహెచ్ వద్ద కుటుంబీకులు ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకూ పోస్టుమార్టంకు ఆటోళన కొనసాగింది. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శ్రీహరిరాజు మతుల బంధువులకు హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు అంగీకరించారు. దీంతోకారదాల ప్రకాశరావు, కారదాల చంద్రరావు, కారదాల ఏసుబాబు మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సోమవారం రాత్రి 8 గంటలకు ఎడిబి రోడ్డు మీదుగా వేట్లపాలెంలోని స్మశాన వాటికకు పోలీసులు తరలించారు. మూడు మృతదేహాలకు కుటుంబీకులు ఖననం చేశారు. మృతులు ముగ్గురు అన్నదమ్ముల సంతానం కావడంతో వేట్లపాలెంలోని వారి గృహాల వద్ద తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. కాగా కాకినాడ సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల నుంచి డిఎస్‌పి శ్రీహరి రాజు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం తనపై 13 మంది మహిళలతో సహా దాడికి పాల్పడ్డారని బాధితులు పేర్కొనగా, ఇప్పటివరకు ఎనిమిది మంది అనుమానితులను సామర్లకోట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

నేరాలు ఘోరాలు



ఉప్పుటేరులోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

శీలవారిపాలెం వద్ద ఉన్న వంతెన పైనుంచి ఉప్పుటేరులోకి సోమవారం ఒక కారు దూసుకుపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండంగి మండలానికి చెందిన స్విఫ్ట్ కారు కాకినాడ వైపు వెళ్తుండగా శిలవారిపాలెం వద్ద ఉన్న వంతెనకు ఇరువైపులా గోడలు లేకపోవడంతో అదుపుతప్పి ఉప్పుటేరులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఇటుకలు తయారు చేసే మట్టిలో కూరుకుపోయిన ట్రాక్టర్‌ను తీస్తుండగా అదే ట్రాక్టర్ కింద పడి ఇటుక తీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన తాళ్లపూడి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం...మండలంలోని తిరుగుడు మెట్ట గ్రామానికి చెందిన దుంపల రాజు ఇటుకల బట్టీలో కార్మికునిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఎప్పటి లాగే పనికి వెల్లాడు. బల్లిపాడు, పెద్దేవం గ్రామాల మధ్య ఇటుక మట్టిలో ట్రాక్టర్ కురుకుపోగా దీనిని తీయడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు అదే డాక్టర్ కింద పడి మరణించాడు. ఘటనా ప్రాంతాన్ని ఎస్ఐ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టిడిపి నాయకులు అన్నమరెడ్డి సత్తిబాబు తదితరులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు.

రేబిస్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కుక్క కరవడంతో రేబిస్ వ్యాధికి గురై చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్రేయపురం కుమ్మర వీధికి చెందిన మానేపల్లి దుర్గాప్రసాద్ (37) ఆర్‌టిసిలో ప్రైవేటు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితం రాత్రి సమయంలో తన ఇంటి వద్ద ఉండగా చేతిపై వీధి కుక్క కరవడంతో దుర్గాప్రసాద్ ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొందాడు. ఈ నెల 14న ఆరోగ్యం సరిగా లేనందున కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి రాబిస్ వ్యాధి సోకినట్లు గుర్తించారు. పరిస్థితి విసరించడంతో దుర్గాప్రసాద్ చికిత్స పొందుతూ సోమవారం మతి చెందాడు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

యానాం వార్తలు



పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు తొలిసారిగా సోమవారం యానాంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకౌంట్స్ ఛైర్మన్, ఎంఎల్ఎ కెఎస్‌పి.రమేష్ ఆధ్వర్యంలో ఆడిట్ సెన్సిటైజేషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సమావేశంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులతో పాటు అంచనాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పుదుచ్చేరి అసెంబ్లీలోని వివిధ పార్టీలైన ఎన్ఆర్ కాంగ్రెస్, బిజెపి, కాంగ్రెస్, డిఎంకె తదితర పార్టీలకు చెందిన ఎంఎల్ఎలు, స్పీకర్ ఆర్ సెల్వం, డిప్యూటీ స్పీకర్ రాజు వేలు, స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. ముందుగా కమిటీ సభ్యులను ఆర్ఎఒ మునిస్వామి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బంకుల వద్ద వివరాలు తప్పనిసరి

ప్రజాశక్తి - యానాం

పెట్రోల్ బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొట్టే పంపులపై రోజువారీ తనిఖీ వివరాలు తప్పనిసరిగా పొందుపరచాలని తూనికలు కొలతల శాఖ డిప్యూటి తహశీల్దారు గణేషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు కచ్చితమైన పరిమాణంలో పెట్రోలు, డీజిల్ నింపుతున్నది లేనిది 5 లీటర్లు, 10 లీటర్ల డబ్బాలతో వేసి ప్రతి రోజు పరీక్షించాలన్నారు. ఒక బంకులో తనిఖీ చేసిన సందర్భంగా 10 లీటర్ల పెట్రోల్‌ను పరిశీలించగా తక్కువ పరిమాణం పెట్రోల్ రావడంతో రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు.


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గొరస-కొమరిగిరి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొంతకాలంగా గొరస-కొమరగిరి రోడ్డుకు ఎట్టకేలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గత వైసిపి పాలనలో రహదారులకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ రహదారి గుంతలుపడి అద్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారులపై ప్రత్యేక దృష్టి సారించడంతో వాలతిప్ప, సత్తమ్మ తల్లి గుడి సెంటర్ నుంచి కొమరగిరి మీదగా కాకినాడకు వెళ్లే రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో రాణించాలి

ఉండ్రాజవరం : నాగసాయి కేశవ్ ఏషియన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని చివటం గ్రామానికి చెందిన మునుపర్తి నాగసాయికేశవ్ ఇటీవల కోయంబత్తూర్‌లో జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ హాకీలో అండర్ 14 విభాగంలో రాణించాడు. బ్రాంజ్ పతకం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం మంత్రి చేతుల మీదుగా కేశవ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల రాష్ట్రం నుంచి భూపేష్ అనే యువకుడు చదరంగంలో మెడల్ సాధించాడన్నారు. ఇటువంటి యువకులను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, సర్పంచ్ ఈడుపుగంటి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు వేముల సత్యనారాయణ, కుదప రమేష్, బాలుడి తండ్రి మునుపర్తి రమేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనుల నిర్వహణ : మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం : కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించాలనే కాంక్షతో, చిత్తశుద్ధితో అన్ని పనులను పూర్తి చేస్తుందన్నారు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం చివటంలో సిసి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రూ.1,600 కోట్ల బకాయిలు పెట్టి, ఖజానాను ఖాళీ చేసి వెళ్ళిపోయిందన్నారు. ఆ లోటును పూడ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఉపముఖ్యమంత్రి చొరవతో త్వరలోనే అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈడుపుగంటి సత్యనారాయణ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు, టిడిపి మండల అధ్యక్షుడు రామకృష్ణ, ముళ్లపూడి పాండురంగ, ఈడుపుగంటి పాండురంగారావు, గ్రామ పెద్దలు పాల్గన్నారు. తొలుత ఎన్‌టిఆర్, కాటన్ దొర, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిఎంను కలిసిన ఎంఎల్ఎ బత్తుల


కోరుకొండ : పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు పరిశీలనకు జిల్లాకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రాజనగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ సోమవారం కలిశారు. సిఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పోలవరం పర్యటనలో పాల్గొన్నారు.

17 నుంచి 20 వరకూ ఆధార్ క్యాంపులు

గోకవరం : మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో ఈనెల 17 నుంచి 20వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ ఎం.గోవిందు తెలిపారు. 17న జగన్నాధపురం, గంగంపాలెం సచివాలయాల్లో, 18న గుమ్ముళ్ళదొడ్డి, తిరుమలయపాలెంలో, 20న కృష్ణుని పాలెం, రంప ఎర్రం పాలెంలో జరుగుతాయన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ క్యాంపులు జరుగుతాయన్నారు.

పిజిడిఎంలో దేవులపల్లికి బంగారు పతకం

ప్రజాశక్తి - పెద్దాపురం



తెలంగాణ రాష్ట్రంలో విద్య నభ్యసిస్తున్న పెద్దాపురం వాసి దేవులపల్లి సాయి వెంకటశాస్త్రి పిజిడిఎంలో బంగారు పతకం సాధించాడు. పెద్దాపురం రామారావు పేటకు చెందిన న్యాయవాది దేవులపల్లి వెంకట శాస్త్రి మనుమడు, దేవులపల్లి ప్రకాశరావు, ఉమాదేవి దంపతుల కుమారుడైన సాయి వెంకటశాస్త్రి హైదరాబాదులో విద్యనభ్యసిస్తున్నాడు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులో 2024 బ్యాచ్‌కు చెందిన సాయి వెంకటశాస్త్రి హైదరాబాద్‌లో జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపిఇ)లో బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా పలువురు సాయి వెంకటశాస్త్రిని అభినందించారు.

డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని 30వ వార్డు పరిధిలోని విద్యుత్ కార్యాలయం ఎదురుగా డ్రెయినేజి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆ ప్రాంత ప్రజలు ఐద్వా ఆధ్వర్యంలో కోరారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు కె.మణి, నాగు మాట్లాడుతూ ఎన్నికల ముందు డ్రెయినేజీ నిర్మాణాన్ని ప్రారంభించారని, అయితే ఆ నిర్మాణాన్ని సగంలో వదిలివేశారని తెలిపారు. దీనిపై మున్సిపల్ అధికారులకు పలు దఫాలుగా వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

17, 18 తేదీల్లో శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 17, 18 తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.స్వప్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని తెలిపారు.

18న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయ హుండీలను ఈనెల 18న తెరిసి ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమించిన అధికారులు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కింపు జరుపుతారన్నారు.


సాయం అందిస్తున్న జనసేన కార్యకర్తలు

బాధిత కుటుంబానికి రూ.20 వేల సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

జనసేన కార్యకర్త చింతల పెదరాజబాబు కుటుం బానికి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని జనసేన కార్యకర్తలు అందించారు. మండలంలోని గిరిజన తండా బాపన్నధారకు చెందిన పెద రాజబాబు ఇటీ వల మృతి చెందాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న జనసేన మండల ఉపాధ్యాక్షుడు శీరం.శ్రీను ఇతర జనసేన కార్యకర్తల నుంచి సేకరించిన రూ.20 వేలను సోమవారం పెద రాజబాబు కుటుంబ సభ్యులకు అంద జేశారు. ఈ సందర్భంగా శీరం శ్రీను మాట్లాడుతూ పార్టీ ఆవిర్బావం నుంచి పెద రాజబాబు పార్టీకి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పిన శ్రీను, పిల్లా శ్రీను, కోసూరి శివ, పోలిశెట్టి ఈశ్వరరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి ప్రజా సంఘాలు నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం సుంకరపాలెం పంచాయతీ పరిధిలోని బాబానగర్‌కు చెందిన జొన్నలగడ్డ మంగమ్మ(102) ఇటీవల మరణించారు. ఆమె చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబురావు, సుంకరపాలెం ఎంపిటిసి సభ్యులు గుత్తుల శ్రీనివాస్ సోమవారం నివాళులు అర్పించారు. ఆమె మనవడు విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు కుటుంబానికి వీరు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్నారి హేమాక్షికి మంత్రి అభినందన

ప్రజాశక్తి- కడియం


హేమాక్షిని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

నృత్య మయూఖ పురస్కార గ్రహీత, కూచిపూడి కళాకారిణి దూడల హేమాక్షిని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. రాజ మహేంద్ర వరంలో జరిగిన సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ ఇంద్రధనస్సు వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. మంత్రికి కూచిపూడి నత్యంతో స్వాగతం పలికిన హేమక్షి అభినయాన్ని మంత్రి మెచ్చారు. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కుమార్తె అయిన హేమాక్షీ తన 4వ ఏటనే నృత్య కళలో ప్రవేశించింది. శ్రీశైలం, ద్రాక్షారామం, అంతర్వేది వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలిచ్చింది. ప్రసుత్తం హేమాక్షి 9వ తరగతి చదువుతోంది.

ప్రాథమిక చికిత్సలో బిఎంపిల పాత్ర కీలకం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు ప్రాథమిక చికిత్స అందించడంలో బిఎంపిల పాత్ర కీలకమైనదని కాకినాడ అరుణ హాస్పిటల్ అధినేత డాక్టర్ చవ్వాకుల శేషగిరిరావు అన్నారు. స్థానిక లారీ వర్కర్స్ యూనియన్ కళ్యాణమండపంలో సోమవారం బిఎంపిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించే బిఎంపిలు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.రాజు గోపికృష్ణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజలు ఒత్తిడికి గురి కావడంతో మానసిక సమస్యలు అధికమయ్యాయని అన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు వివి.కృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సిరికి శ్రీను, ఉపాధ్యక్షుడు ఎం.రామ్‌లక్ష్మణరావు, పదిలం బెన్నిబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్యామ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు లక్ష్మణచారి, బర్రె నరసింహమూర్తి షేక్ ఆశిక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తాళ్లరేవు : జార్జిపేట, సుంకరపాలెం పంచాయతీలో మండల పరిషత్ నిధులు రూ.14 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎంపిపి రాయుడు సునీత సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జార్జిపేట పంచాయతీలోని ఎంఎస్ఆర్ నగర్‌లో రూ.6 లక్షలతో డ్రెయినేజీని, సుంకరపాలెం పంచాయతీలో రూ. 8 లక్షలతో 4 సిసి రోడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుంకరపాలెం సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు టి.నాగేశ్వర రావు, జార్జిపేట సర్పంచ్ జి.సత్య వేణి, నాయకులు వి.భాస్కరరాజు, ఎం.రాంబాబు, మాజీ సర్పంచ్ కడలి శ్రీనివాస్, కూనపురెడ్డి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, సుంకర పాలెం పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ పిజిఆర్ఎస్‌కు 35 అర్జీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 36 అర్జీలు అందాయని ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడారు. వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. సివిల్ కేసులు, కుటుంబ సమస్యలు, , చీటింగ్ కేసులు, కొట్లాట తదితర కేసులకు సంబంధించి ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు.

. కనకదుర్గమ్మ తీర్థానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - కడియం

కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డులో కనువిందు చేసే నర్సరీల మధ్య ఉన్న శ్రీ కనక దుర్గమ్మ వారి తీర్థ మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18న తీర్థ ఉత్సవాలు ప్రారంభమై 22 వరకు కొనసాగుతుంది. 40వ వార్షికోత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రాంగణం విద్యుత్ అలంకరణలతో తీర్చిదిద్దారు. కడియం మండలంతో పాటు రాజమహేంద్రవరం రూరల్, ఆలమూరు, మండపేట పరిసర మండలాల ప్రజలు ఇక్కడ మొక్కులు తీర్చుకోవడానికి వస్తుంటారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధి ప్రణాళికా లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం వెలుగు మీటింగ్ హాల్, సచివాలయం-4లో ఎంపిడిఒ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 18వరకూ గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ప్రణాళికపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయం, మండల సిబబ్బందికి శిక్షణా తరగతులు జరుగనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయని ఎంపిడిఒ తెలిపారు. తప్పని సరిగా ఈ శిక్షణా కార్యక్రమాలకు హాజరవ్వాలన్నారు. జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

ఘనంగా విజయ్ దివస్


ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు ఆధ్వర్యంలో సోమవారం విజయ్ దివస్‌ను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ భారతదేశంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. దేశంలో వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని ఈ సందర్భంగా హెచ్ఎం విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అవసరం మేరకే విద్యుత్‌ను వినియోగించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

అవసరం మేరకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలని విద్యుత్ శాఖ ఎడి వి.రవిశంకర్, ఎఇ డి.శ్రీనివాస్ అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు జరుపుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గోపాలపురం జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక యూనిట్ పొదుపు రెండు యూనిట్లు ఉత్పత్తికి సమానమన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్‌ను వాడుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వాలు సోలార్ ఇంధన పథకాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. స్టార్ రేటెడ్ ఉపకరణాలను వినియోగించాలని తెలిపారు. ఎల్ఇడి బల్బులను వినియోగించడం వల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఇంధన పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. పోటీల్లో విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.సోమశేఖర్, ఉపాధ్యాయులు బెనర్జీ, లక్ష్మీకుమారి, రిజ్వాన్, ఎలక్ట్రికల్ లైన్‌మేన్ చింతలపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వ్యాస రచన పోటీలను పర్యవేక్షిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

చాగల్లు : మండలంలో డిసెంబర్ 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా చాగల్లు జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించామని విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఇ ఎం.కృష్ణనాయక్, జెఇ జె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.